క్లుప్తంగా

పట్టణ అభివృద్ధే ధ్యేయం

జమ్మికుంట: పట్టణ అభివృద్ధే ధ్యేయంగా పాలకవర్గం పనిచేస్తుందని మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపెల్లి రాజేశ్వర్‌రావు అన్నారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. పలు అభివృద్ధి పనులు, బిల్లులతో కూడిన 20 అంశాలను తీర్మానం కోసం ప్రవేశ పెట్టగా కౌన్సిల్ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదిం తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సమ్మ య్య, వైస్ చైర్మన్ దేశిని స్వప్నకోటి, వార్డు కౌన్సిలర్లు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నోట్‌బుక్స్ పంపిణీ

రామడుగు: మండలంలోని వెదిర ప్రాథమిక పాఠశాలలో మంగళవారం సంతు రవిదాస్ మహారాజ్ జయంతిని బీజేపీ ఎస్సీ మోర్చా మండల అధ్యక్షుడు చంటి జితేందర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన బీజేపీ ఎస్సీ మోర్చారాష్ట్ర అధికార ప్రతినిధి జాడి బాల్‌రెడ్డి, చొప్పదండి నియోజక వర్గ కన్వీనర్ పెరుక శ్రావణ్‌కుమార్ విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. విద్యార్థులు సంతు రవిదాస్ మహారాజ్‌ను ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఎడమ సత్యనారాయణరెడ్డి, ఉప్పు రాంకిషన్, గుడిపాక రాములు, ఎడవెల్లి రాజిరెడ్డి, రాము, శ్రీనివాస్, మహేష్, హరికృష్ణ, రామకృష్ణ, మహిపాల్‌రెడ్డి పలువురు పాల్గొన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటుకు రూ. 90వేలు విరాళం

చిగురుమామిడి: మండలంలోని ఉల్లంపల్లి గ్రామంలో సీసీ కెమెరాల ఏర్పాటుకు యువత ముందుకు వచ్చారు. మంగళవారం చిగురుమామిడి ఎస్సై దాస సుధాకర్ కు సీసీ కెమెరాల ఏర్పాటుకు రూ. 90వేల చెక్కును విరాళంగా అందించారు. గ్రామ యువత అధ్యక్షుడు సుదగోని శ్రీనివాస్ ఆధ్వర్యంలో అన్ని కులాల్లోని యువకులు విరాళం ఇచ్చారు. అనంతరం ఎస్సై మాట్లాడుతూ ప్రతి గ్రామంలో సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రజలు, యువత, స్థానిక ప్రజాప్రతినిధులు పెద్ద ఎత్తున కదలిరావడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో నాయకులు జనవేని రమేశ్, ఎంపీటీసీ రాగుల రమేశ్, చట్ల రవి, తాల్లపల్లి శ్రీనివాస్, సుధగోని శ్రీధర్, కానవేని తిరుపతి, సతీష్, సాంబరాజు, వెంకటేశ్వర్లు, కానవేని జితేందర్, మోహన్ పాల్గొన్నారు.

ఆయుష్మాన్ భారత్ సద్వినియోగం చేసుకోవాలి

చొప్పదండి: ఆయుష్మాన్ భారత్ ద్వారా పేద వారికి రూ. 5 లక్షల వరకు కుటుంబ మొత్తానికి ప్రైవేట్, ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యం చేయించుకునే వెసలుబాటు ఉందని, అర్హులు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ గుర్రం నీరజ కోరారు. పట్టణంలోని ఒకటో వార్డులో మంగళవారం పథకంపై నిర్వహించిన అవగాహన సమావేశానికి హాజరై మాట్లాడారు. తెల్లరేషన్ కార్డు ఉన్నవారు నిబంధనలకు లోబడి ఉంటే నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ అశోక్, సీఏసీ నిర్వాహకులు సోనియా, గౌతమి, ప్రశాంతి, లక్ష్మి, రాజయ్య, తదితరులు పాల్గొన్నారు.

కూలీల సంఖ్య పెంచాలి

గన్నేరువరం: జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో కూలీల సంఖ్య పెంచాలని అదనపు గ్రామీణ అభివృద్ధి అధికారి సంధ్యారాణి అన్నారు. మండలంలోని ఈ పథకంలో గుండ్లపల్లి, గునుకులకొండాపూర్, జంగపల్లి గ్రామాల్లో ఈజీఎస్ పనులను మంగళవారం పరిశీలించారు. కూలీల సమస్యలను గునుకులకొండాపూర్ ఫీల్డ్ అసిస్టెంట్ యాదగిరి ఆమె దృష్టికి తీసుకెళ్లారు. మండల పరిషత్‌లో ఉపాధిహామీ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. కూలీలకు పనులు కల్పించడంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీవో నర్సింహారెడ్డి, ఈసీ రమేష్, టెక్నికల్ అసిస్టెంట్లు సంపత్, వాణి, ఫీల్డ్ అసిస్టెంట్లు యాదగిరి, తిరుపతి, అశోక్, సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

చిగురుమామిడి: మండలంలోని ఇందుర్తి గ్రామంలో పలు అభివృద్ధి పనులను మంగళవారం జెడ్పీటీసీ గీకురు రవీందర్ పరిశీలించారు. సర్పంచ్ అందె స్వరూపతో కలిసి మన ఊరు మనబడి కార్యక్రమంలో నిర్మిస్తున్న ప్రహరీ, ఈజీఎస్ నిధులతో నిర్మిస్తున్న కూరగాయల సంత, ఆరోగ్య ఉపకేంద్రం పనులను తనిఖీ చేసి సత్వరం పూర్తిచేయాలని కోరారు. వెంట ఉపసర్పంచ్ సతీష్, సింగిల్‌విండో డైరెక్టర్ స్వామి, ఈసీ రాజయ్య, పంచాయతీ కార్యదర్శి వెంకటరమణారెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్ లక్ష్మి, కాంట్రాక్టర్ మల్లేశం తదితరులున్నారు.

రైతుల జాగారం

- కరెంట్ వచ్చేది, పోయేది తెలియక పొలాల వద్ద పడిగాపులు
- కరెంట్ కోతలతో అన్నదాతల తిప్పలు
- ఎండుతున్న మొక్కజొన్న, వరి పంటలు



“ పై ఫోటోలో రాత్రి పూట పొలం వద్ద పడుకున్న రైతు పేరు రఘువరన్. వీణవంక మండలం హిమ్మత్‌నగర్ గ్రామం. నాలుగెకరాల్లో వరి, మరో నాలుగెకరాల్లో మొక్కజొన్న వేశాడు. మొక్కజొన్న ఏపుగా పెరిగింది. నీటి తడులు అందించే సమయంలో కొద్ది రోజులుగా కరెంట్ కోతలతో మొక్కజొన్నకు నీరు అందడంలేదు. దీంతో రైతు కరెంట్ కోసం ప్రతిరోజు రాత్రి పూట పొలం వద్ద జాగారం చేస్తున్నాడు. రాత్రి వేళ కరెంట్ ఎప్పుడు వస్తదో తెలియదని, ఎలుగుబంట్ల బెడద ఉన్నా ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని నీటితడులు అందిస్తున్నానని రైతు వాపోయాడు. అయినా నీరందక పంట ఎండుతుందని ఆవేదన వ్యక్తం చేశాడు. ఇదీ ఈ ఒక్క రైతు పరిస్థితి కాదు, జిల్లాలోని రైతులు కరెంట్ కోతలతో బెంబేలెత్తిపోతున్నారు. ”



హిమ్మత్‌నగర్‌లో ఎండుతున్న పొలం

వీణవంక:వ్యవసాయానికి 24గంటల కరెంట్ ఇస్తున్నామని పాలకులు చెప్పుతున్న క్షేత్రస్థాయిలో భిన్నంగా ఉంది.

- కొద్ది రోజులుగా కరెంట్ కోతలతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.
- పంటలు కాపాడుకోడానికి పగలు, రాత్రి తేడా లేకుండా పొలాల వద్ద జాగారం చేస్తున్నారు.
- కరెంట్ ఎప్పుడు ఇస్తున్నారో తెలియక అవస్థలు పడుతున్నారు.
- వీణవంక మండలంలో ఆరు విద్యుత్ సబ్‌స్టేషన్లు, వీటి పరిధిలో పదివేలకు పైగానే వ్యవసాయ కనెక్షన్లు ఉన్నాయి.
- మండల వ్యాప్తంగా 22వేల ఎకరాల్లో వరి, 2,600ఎకరాల్లో మొక్కజొన్న పంటలను సాగుచేస్తున్నారు.
- ప్రస్తుతం మొక్కజొన్న పీచుదశలో ఉండగా వరి కలుపు దశలో ఉంది. కొద్ది రోజులుగా ఎండలు ఎక్కువ అవుతుండటంతో నీటితడులు పెరిగాయి.

అధికారులకే సమాచారం లేదు

కరెంట్ కోతల సమాచారం ట్రాన్స్‌కో అధికారులకు ముందస్తుగా తెలియడంలేదు. త్రీఫేజ్ సరఫరా చేయడానికి ఆరగంట ముందు ఉన్నతాధికారుల నుంచి మెస్సేజ్ వస్తుంది. ఇదీ రైతులకు తలనొప్పిగా మారింది. ముందస్తుగా సమాచారం ఉంటే రైతులు ఆసమయంలో వ్యవసాయ క్షేత్రాలకు వెళ్తారు. కానీ అలాంటి సమాచారం లేకపోవడంతో రైతులు రాత్రి 7గంటల నుంచి పొలాల వద్ద ఉంటున్నారు. పగలు నాలుగు గంటలు మాత్రమే త్రీ ఫేజ్ ఇస్తుండటంతో నీరు పారడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మొక్కజొన్న రైతులకు కష్టాలు

వరి పంటకు ఆటోమెటిక్ స్టార్టర్లు ఉండటంతో కరెంట్ వచ్చినప్పుడు మోటార్లు పోస్తున్నాయి. మొక్కజొన్నకు మాత్రం తప్పనిసరిగా నీటి తడులు అందించాల్సి ఉంటుంది. పగలు సక్రమంగా కరెంట్ సరఫరా కాకపోవడంతో రాత్రి పూట తడులు అందించాల్సి వస్తోంది. రాత్రి వేళ విషపురుగులు, ఎలుగుబంట్లు, అడవి పందుల బెడదతో ప్రాణాలు అరచేతిలో పెట్టుకోవాల్సిన పరిస్థితి తలెత్తిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైన పాలకులు, అధికారులు స్పందించి పగటి పూట త్రీఫేజ్ సరఫరా చేయాలని కోరుతున్నారు. ఈ విషయంపై ట్రాన్స్‌కో ఏఈ సత్యనారాయణరెడ్డిని వివరణ కోరగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సరఫరా చేస్తున్నాం. ఎప్పటి నుంచి ఎప్పటి వరకు త్రీఫేజ్ ఇవ్వాలో మెస్సేజ్ వస్తుంది. మెస్సేజ్ ప్రకారం కరెంట్ సరఫరా చేస్తున్నాం.

కోతలు విధించడం సరికాదు



వ్యవసాయానికి 24 గంటల కరెంట్ ఇస్తున్నామని చెబుతున్న ప్రభుత్వం కోతలు విధిస్తూ రైతులను ఇబ్బందులకు గురిచేయడం సరికాదు. కరెంట్ ఎప్పుడు ఇస్తున్నారో తెలియక మొక్కజొన్న సాగు చేస్తున్న రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పంటలు ఎండిపోయే ప్రమాదం పొంచి ఉంది. అధికారులకు కరెంట్ ఎప్పుడు ఇస్తు న్నారో తెలపడంలేదు. రాత్రి వేళ పొలాల వద్ద జాగారం చేస్తున్నారు. ప్రభుత్వం రైతుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది.

– మడుగూరి సమ్మిరెడ్డి, బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి

‘రైతుబీమా’తో ఆర్థిక భరోసా

ఎమ్మెల్యే సుంకె రవిశంకర్



ప్రొసీడింగ్ అందజేస్తున్న ఎమ్మెల్యే రవిశంకర్

గంగాధర: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు బీమా పథకం మృతిచెందిన రైతు కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పిస్తోందని ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. మండలంలోని కాచిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన రైతు మడుపు తిరుపతిరెడ్డి రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా ఆయన కుటుంబానికి మంజూరైన ఐదులక్షల రైతుబీమా ప్రొసీడింగ్‌ను మంగళవారం కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ రైతు సంక్షేమమే ధ్యేయంగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. భూమి ఉన్న రైతు ఏ కారణంతో చనిపోయినా వారం రోజుల్లో ఖాతాల్లో నగదు జమ చేస్తున్నామని, రైతులకు పంటల సాగులో అండగా నిలవడానికి ఎకరాకు పదివేల పెట్టుబడి సాయం అందిస్తున్నామని పేర్కొన్నారు. సాగునీటి సమస్య పరిష్కారానికి ప్రాజెక్టుల నిర్మాణంతో పాటు, మిషన్ కాకతీయ పథకం ద్వారా చెరువులు, కుంటలు మరమ్మతులు చేయించామన్నారు. వ్యవసాయానికి 24 గంటల విద్యుత్ సరఫరా చేస్తున్నామని అన్నారు. వెంట సర్పంచ్ జోగు లక్ష్మిరాజం, పంచాయతీ పాలకవర్గం పలు గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు నాయకులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ

మండలంలోని కొట్ల నర్సింహులపల్లి, సర్వారెడ్డిపల్లి, వెంకటాయిపల్లి గ్రామాల్లోని లబ్ధిదారులకు ఎమ్మెల్యే కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పాఠాలు బోధించిన ఎంఈవో



వీణవంక: మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల, కొండపాక గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలను ఎంఈవో విడపు శ్రీనివాస్ మంగళవారం సందర్శించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన తొలిమెట్టు కార్యక్రమంలో భాగంగా విద్యార్థుల కనీస సామర్థ్యాలను పరిశీలించారు. అనంతరం తెలుగు, గణితం, ఇంగ్లిష్ సబ్జెక్టులు బోధించి విద్యార్థులకు మెళుకువలు నేర్పించారు. అనంతరం మాట్లాడారు. మన ఊరు–మన బడి కార్యక్రమంలో భాగంగా మొదటి విడతలో నిధులు మంజూరు చేసిందని, 12 రకాల పనులు చేపట్టి పాఠశాలల బలోపేతానికి ప్రభుత్వం కృషి చేసిందన్నారు. వెంట ఉపాధ్యాయులు అన్వర్ పాషా, సీఆర్పీ కొంరయ్య ఉన్నారు.

‘డబుల్’ ఇళ్లు కేటాయించాలని ఆందోళన



ఆందోళన నిర్వహిస్తున్న బీఎస్పీ నాయకులు

హుజూరాబాద్: హుజూరాబాద్ నియోజకవర్గంలోని నిరుపేదలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు కేటాయించాలని డిమాండ్ చేస్తూ బీఎస్పీ ఆధ్వర్యంలో మంగళవారం అంబేడ్కర్ చౌరస్తా వద్ద ఆందోళన నిర్వహించారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి సమ్మయ్య మాట్లాడుతూ... బీ ఆర్‌ఎస్ ప్రభుత్వం ఎనిమిది సంవత్సరాల నుంచి నిరుపేదలను మోసం చేస్తుందన్నారు. నియోజకవర్గ పరిధిలో సుమారు 4,500 డబుల్ బెడ్ రూమ్‌లు ఇస్తామని, మండలానికి వంద డబుల్ బెడ్‌రూంలు కూడా పూర్తిగాని పరిస్థితులు ఉన్నాయని తెలిపారు. నిర్మించిన వాటిలో అరకొర వసతులు, నాణ్యత లోపంతో కూలిపోయే స్థితిలో ఉన్నాయన్నారు. ఇప్పటికైనా నిర్మించినవి పంపిణీ చేయకుంటే గృహ ప్రవేశం చేయిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు సదానందం, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రెటరీ రవీందర్, జిల్లా మహిళా కన్వీనర్ మిడిదొడ్డి సప్న, జిల్లా కార్యదర్శి, నియోజకవర్గం ఇన్‌చార్జ్ మారపల్లి మొగులయ్య, నాయకులు రామ్ శ్రీనివాస్, సంధ్యల వెంకన్న ,పుల్ల భిక్షపతి, గరవేణి శ్రీకాంత్, సదానందం, శ్రీనివాస్, సంజీవ్ పాల్గొన్నారు.

సన్మానం



విజేతను సన్మానిస్తున్న పద్మాకర్ రెడ్డి

చొప్పదండి: విద్యార్థులు తమలో దాగిఉన్న సృజనాత్మకతను వెలికితీయడంతో పాటు, జాతీయ స్థాయి క్రీడల్లో రాణించాలని డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి అన్నారు. జాతీయ స్థాయి పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో ఇటీవల రాష్ట్రం తరుపున పాల్గొని బంగారు పతకం సాధించిన చిప్పకుర్తి గ్రామానికి చెందిన పులి ఆంజనేయులుగౌడ్‌ను మంగళవారం ఘనంగా సన్మానించారు. క్రిష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడుతూ మానసిక, శారీరక ఉల్లాసానికి ప్రతి ఒక్కరూ క్రీడల్లో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో శంభయ్య, తదితరులు పాల్గొన్నారు.

బడ్జెట్‌లో రజకులకు అన్యాయం

శంకరపట్నం: బడ్జెట్‌లో రజకులు, నాయీబ్రాహ్మణులకు నిధులు కేటా యించకుండా ప్రభుత్వం అన్యాయం చేసిందని రజక హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పూసాల సంపత్ ఆరోపించారు. కేశవపట్నంలో మంగళవారం విలేకర్లతో మాట్లాడారు. ఇస్త్రీ పెట్టెలు, సెలూన్‌షాపులకు ఉచితంగా విద్యుత్ సరాఫరా చేస్తామని చెప్పి, విద్యుత్ రీడింగ్ తీసి బిల్లులు చెల్లించాలని ఒత్తిడి చేస్తున్నారని, తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి రజక కార్పొరేషన్ రుణాలు అందించలేదని విమర్శించారు. సమావేశంలో మండల అధ్యక్షుడు తిరుపతి, వెంకటేశ్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సైన్స్ టాలెంట్ టెస్ట్



జమ్మికుంట: బహుమతులు అందజేస్తున్న ఎంఈవో

ఇల్లందకుంట: పట్టణంలోని ప్రభుత్వ బాలికల పాఠశాలలో మంగళవారం గంగిశెట్టి మధురమ్మ మెమోరియల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు , రిటైర్డ్ టీచర్ గంగిశెట్టి జగదీశ్వర్ ఆధ్వర్యంలో జమ్మికుంట, ఇల్లందకుంట, వీణవంక, హుజూరాబాద్ మండలాల్లో పదోతరగతి చదివే తెలుగు/ఇంగ్లిష్ మీడియం విద్యార్థులకు సైన్స్ టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మె మోంటో, డిక్షనరీ, నగదు బహుమతులు, పలువురు విద్యార్థులకు కన్సోలేషన్ సర్టిఫికెట్లు అందజేశారు. హెచ్‌ఎం జి.సాంబయ్య, టీచర్లు సీహెచ్.వేణు, కె.శంకర్, స్వామి, పద్మ, మారుతి, సమ్మిరెడ్డి, మ ల్లయ్య, సత్యనారాయణ, శ్రీదేవి, అన్నపూర్ణ, వెంకటరాజం, నాగరాజు విద్యార్థులను అభినందించారు.

జమ్మికుంట: పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో ట్రస్ట్ ఆధ్వర్యంలో జాతీయ సైన్స్ దినోత్సవం పురస్కరించుకొని పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మెమోంటో, డిక్షనరీ, నగదు బహుమతులు, పలువురు విద్యార్థులకు కన్సోలేషన్ సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ నిర్వాహకులు గంగిశెట్టి జగదీశ్వర్, ఎంఈవో విడపు శ్రీనివాస్, ఎస్‌ఐ యూనిస్ అహ్మద్ అలీ, ప్రధానోపాధ్యాయులు దామెర సుధాకర్, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉపకాలువలు నిర్మించొద్దు

గన్నేరువరం: గన్నేరువరం, బెజ్జంకి మండలాల్లో ఉపకాలువల నిర్మాణాలను ప్రభుత్వం, సంబంధిత శాఖ అధికారులు మానుకోవాలని రైతు సంరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు సింగిరెడ్డి భాస్కర్‌రెడ్డి అన్నారు. మంగళవారం గుండ్లపల్లిలో మాట్లాడారు. మిడ్ మానేరు ప్రాజెక్టు కుడికాలువకు అనుసంధానంగా చేపట్టిన పలు ఉపకాలువల ద్వారా ఇప్పటికే పంటలకు పుష్కలంగా సాగునీరు అందుతోందని తెలిపారు. కాల్వల కింద సబ్‌మైనర్ నిర్మాణాలు చేపడితే సరిపోతుందన్నారు. అధిక నీటివల్ల భూములు జాలుతో సాగుకు యోగ్యం కానీ పరిస్థితులు వచ్చాయని రైతులు ఆవేదన చెందుతున్నారని తెలిపారు. ప్రభుత్వం మళ్లీ ఉపకాలువల నిర్మాణాలు చేపట్టాలంటే ఓపెన్ మార్కెట్ ప్రకారం భూమి కోల్పోతున్న రైతుకు పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. అలాగే ఎకరం భూమిలో ఎక్కువ భాగం నష్టం జరిగి తక్కువ భాగం ఉన్నట్లయితే మొత్తానికి పరిహారం ఇవ్వాలని, భూ ములు కోల్పోతున్న రైతులకు అధికారులు ముందుగా నోటీసులు ఇచ్చిన తర్వాత సర్వే చేపట్టాలన్నారు.

క్షేత్రస్థాయి సందర్శన



కుండల తయారీని పరిశీలిస్తున్న విద్యార్థులు

చిగురుమామిడి: మండలంలోని బొమ్మనపల్లి జెడ్పీ పాఠశాల విద్యార్థులకు మంగళవారం మట్టికుండలు, పాత్రల తయారీపై అవగాహన కల్పించారు. శాలివాహనుడు విజ్జగిరి ఎల్లయ్య వద్దకు ఆరో తరగతి చదువుతున్న విద్యార్థులను హెచ్‌ఎం రాజమౌళి, జీవశాస్త్రం ఉపాధ్యాయురాలు అవునూరి భారతి తీసుకెళ్లారు. మట్టిని నానబెట్టి చక్రంపై కుండలు, ఇతర చిన్నచిన్నపాత్రలు తయారు చేసేది ప్రాక్టికల్‌గా చూపించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ విద్యార్థులకు బోధనాపరంగా కాకుండా క్షేత్రస్థాయిలో సందర్శిస్తే అవగాహన వస్తుందన్నారు. రాగి, స్టీల్, ఇతర పాత్రల వాడకం వల్ల అనారోగ్యానికి గురవుతామని, మట్టి పాత్రలు ఉపయోగించడం వల్ల పర్యావరణం దెబ్బతినే అవకాశం ఉందని తెలిపారు.

బీఎస్పీ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ



చొప్పదండి: సంతకాలు సేకరిస్తున్న నాయకులు

చొప్పదండి: బీసీ రిజర్వేషన్లు పెంచాలని కోరుతూ మండల కేంద్రంలో మంగళవారం బీఎస్పీ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమానికి హాజరైన బీఎస్పీ నియోజక వర్గ ఇన్‌చార్జి కొంకటి శేఖర్ మాట్లాడుతూ.. అధిక జనాభా ఉన్న బీసీలకు దక్కాల్సిన న్యాయమైన వాటా అందించాలని, రిజర్వేషన్లు పెంచకుంటే ఉద్యమం ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో ఇరుగురాల రమేశ్, షమీమ్, పిట్ట మనోహర్, మోదుగు పవన్‌కళ్యాణ్, విద్యాసాగర్, అరిఫ్, రోహిత్, మల్లేశ్, ఉదయ్, తదితరులు పాల్గొన్నారు.

రామడుగు: మండల కేంద్రంలో మంగళవారం బీఎస్పీ మండల శాఖ అధ్యక్షురాలు బూత్కూరి కాంత ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. జనాభా ప్రాతిపదికన బీసీలకు 27 శాతం కాకుండా 52 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని సంతకాల సేకరణ చేపట్టారు. కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు షమీం, వెల్పుల అనూష, కొంకటి శ్యాం, శ్రీ శైలం, తిరుపతి, భరత్, సంతోష్‌కుమార్, రాజేందర్, సాయికుమార్ పలువురు పాల్గొన్నారు.

కంటి వెలుగు శిబిరం ప్రారంభం



జమ్మికుంట: కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

ఇల్లందకుంట: మండలంలోని శ్రీరాములపల్లి గ్రామంలో రెండో విడత కంటి వెలుగు శిబిరాన్ని సర్పంచ్ తిప్పరబోయిన మొగిలి మంగళవారం ప్రారంభించారు. కంటి సమస్యలు ఉన్నవారు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్ తులసీదాస్, మోహన్‌రెడ్డి, ఓల్లాల దామోదర్, నాగలక్ష్మి, రష్మిత, కొండల్‌రెడ్డి, వీరన్న, శ్యామల, గ్రామస్తులు పాల్గొన్నారు.

జమ్మికుంట: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న కంటి వెలుగు కార్యక్రమం దేశానికి ఆదర్శంగా నిలుస్తోందని మున్సిపల్ చైర్మన్ తక్కళ్ళపెల్లి రాజేశ్వర్‌రావు అన్నారు. మున్సిపల్ పరిధి కొత్తపల్లిలో కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించారు. పేదల సంక్షేమం కోసం అనేక పథకాలను బీఆర్‌ఎస్ ప్రభుత్వం అందిస్తుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ దేశిని స్వప్నకోటి, కౌన్సిలర్లు దేశిని రాధసదానందం, ఎలగందుల స్వరూపశ్రీహరి, వైద్యులు దిలీప్, రత్నాకర్, అరుణ, ఏఎన్‌ఎంలు వాణిశ్రీ, సంధ్య, కవిత, ఆశ వర్కర్లు, సీఎల్‌ఆర్‌పీ, ఆర్‌పీలు, తదితరులు పాల్గొన్నారు.



డ్రోన్‌ల వినియోగంపై అవగాహన

అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త వెంకటేశ్వర్‌రావు

వీణవంక: మండలంలోని రెడ్డిపల్లి, గంగారం గ్రామాల్లో కృషి విజ్ఞాన కేంద్రం, వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో వ్యవసాయంలో డ్రోన్ల వినియోగంపై రైతులకు అవగాహన కల్పించారు. అగ్రికల్చర్ డ్రోన్ ప్రాజెక్టు 2022–23లో భాగంగా డ్రోన్ ద్వారా నానో యూరియా పిచికారీపై క్షేత్రస్థాయి ప్రదర్శన ఇచ్చారు. ఈసందర్భంగా కేవీకే సీనియర్ శాస్త్రవేత్త వెంకటేశ్వర్‌రావు మాట్లాడుతూ.. వ్యవసాయంలో డ్రోన్ల వాడకంతో ఖర్చు, సమయం ఆదా అవుతుందని తెలిపారు. అదేవిధంగా కూలీల కొరత చాలా వరకు తగ్గుతుందన్నారు. రైతులు డ్రోన్ల వాడకంపై దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు శ్రీనివాస్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, విజయ్, వ్యవసాయ అధికారి గణేశ్, ఈఏవోలు రాకేశ్, శ్రీకాంత్, ఏటీఎం స్రవంతి, సర్పంచ్ నర్సయ్య, ఉపసర్పంచ్ విజేందర్‌రెడ్డి, ఎంపీటీసీ వీరారెడ్డి, తిరుపతిరెడ్డి, కుమారస్వామి, పీఏసీఎస్ డైరెక్టర్లు శ్రీనివాస్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ఆధ్యాత్మికం

బ్రహ్మోత్సవాలకు తరలి వచ్చిన భక్తులు



శంకరపట్నం: ధ్వజస్తంభానికి మొక్కుతున్న భక్తులు

శంకరపట్నం: మండలంలోని కొత్తగట్టు మత్స్యగిరీంద్రస్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని మంగళవారం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. కోనేరులో స్నానాలు, గండదీపం వెలిగించారు. ధ్వజస్తంభానికి, మత్స్యగిరీంద్రస్వామి, క్షేత్రపాలకుడు నర్సింహాస్వామి, ఆంజనేయస్వామి, శివుడికి పూజలు చేశారు. ఘట్‌రోడ్డు దిగువన పోచమ్మతల్లిని చల్లంగా చూడాలని వేడుకున్నారు. స్వామివారి దర్శనం కోసం మొక్కుబడి పేరిట భక్తుల నుంచి ఒక్కొక్కరి నుంచి రూ.5 టికెట్ పేరిట దేవదాయశాఖ అధికారులు వసూల్ చేయడంపై భక్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు.



జమ్మికుంట: రశీదు ఇస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

పోచమ్మ గుడి నిర్మాణానికి విరాళం



చొప్పదండి: విరాళం ఇస్తున్న దాతలు

జమ్మికుంట: మండలంలోని మాచనపల్లిలో పోచమ్మ గుడి నిర్మాణానికి దాతలు మంగళవారం విరాళం అందజేశారు. రామడుగు మాధవరావు (మహలక్ష్మి ఐరన్, హార్డ్‌వేర్) రూ.51,116, ముదిగంటి ప్రకాశ్‌రెడ్డి రూ.21,116, కాకతీయ విద్య సంస్థలు రూ.20,116, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ తుమ్మేటి సమ్మిరెడ్డి రూ.10,116, గాండ్ల సంపత్ రూ.10,116 విరాళంగా ఇచ్చారు. ఆలయ కమిటీ సభ్యులు బొజ్జం తిరుపతిరెడ్డి, పాల్సాని రాజేశ్వర్‌రావు, కసవేన రాజమల్లు, పర్లపల్లి రమేష్, పర్లపల్లి నాగరాజు, వీర్ల సాంబమూర్తి, పర్లపల్లి అశోక్, గుర్రపు సంపత్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సాయిబాబా ఆలయ నిర్మాణానికి..

చొప్పదండి: మండల కేంద్రంలో నిర్మిస్తున్న సాయిబాబా ఆలయానికి పట్టణానికి చెందిన బుర్ర రవీందర్‌గౌడ్, లక్ష్మి దంపతులు మంగళవారం రూ. 51 వేల విరాళం ఆలయ చైర్మన్ గుర్రం హన్మంతరెడ్డికి అందించారు. మార్చి 6 నుంచి 9 వరకు విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు జరుగుతాయని తెలిపారు. కార్యక్రమంలో లింగన్న, ఇంద్రసేనారెడ్డి, మహేశ్, ఆనందం, రవిందర్, మోహన్, తదితరులు పాల్గొన్నారు.